




# కరపత్రం

SINCE 2014

మంగళవారం మార్చి 18 2025 సంపుటి :0 సంచిక : 155 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు :4


# చర్లపల్లి రైల్వే టెర్మినల్‌కు పొట్టి శ్రీరాములు పేరు పెడదాం: సీఎం రేవంత్ ప్రతిపాదన


2లో

- పొట్టి శ్రీరాములు తెలుగు వర్సిటీకి సురవరం ప్రతాప్‌రెడ్డి పేరు పెట్టనున్న తెలంగాణ ప్రభుత్వం.
- పరిపాలనా సౌలభ్యం కోసం యూనివర్సిటీల పేర్ల మార్పు, తెలంగాణకు సంబంధించిన గొప్ప వ్యక్తుల పేర్లు కల్పించామని సీఎం రేవంత్ రెడ్డి వివరణ.
- పొట్టి శ్రీరాములు పేరు పెట్టాలని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తామని సీఎం ప్రకటన.
- బల్కంపేట్ నేచర్ క్యూర్ ఆస్పత్రికి రోశయ్య పేరు పెట్టాలని, ఆసుపత్రి సమీపంలో ఆయన విగ్రహం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం.

## అబద్ధాల పునాదుల మీద మేం ప్రభుత్వాన్ని నడపలేం: సీఎం రేవంత్ రెడ్డి

2లో

'రాజీవ్ యువ వికాసం' పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అసెంబ్లీ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, పలువురు పార్టీ నేతలతో కలిసి ఈ పథకాన్ని సీఎం ప్రారంభించారు.

## తెలంగాణ శాసనసభ ముందుకు ఎస్సీ వర్గీకరణ, బీసీ రిజర్వేషన్ బిల్లులు


2లో

తెలంగాణ శాసనసభ లో కీలక బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది.

## తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలపై శ్రీవారి దర్శనం.. తితిదే అనుమతి


2లో

తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలపై శ్రీవారి దర్శనం కల్పించేందుకు అనుమతించనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) వెల్లడించింది.

## డీలిమిటేషన్‌పై అఖిలపక్ష సమావేశం.. హాజరుకాని భాజపా, భారాస

హైదరాబాద్: డీలిమిటేషన్ పై తెలంగాణ ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసింది. అసెంబ్లీ కమిటీ హాలులో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో పలు పార్టీలకు చెందిన నేతలు హాజరయ్యారు. కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, ఎంఐఎం ప్రతినిధులు హాజరుకాగా.. భాజపా, భారాస ప్రతినిధులు హాజరుకాలేదు.



## ఆడబిడ్డలను అక్రమ కేసులతో జైల్లో వేయడమే ఇందిరమ్మ రాజ్యమా? : కేటీఆర్



- ఇందిరమ్మ రాజ్యమా లేక ఎమర్జెన్సీ రాజ్యమా?
- మహిళా జర్నలిస్టులు రేవతి, తన్వీ యాదవ్‌లను అక్రమ కేసుల్లో అరెస్టు చేయడంపై ఆగ్రహం వ్యక్తం.
- కాంగ్రెస్ హామీలు మోసపూరితమని, ప్రజలు అప్పుడే అసంతృప్తిగా ఉన్నారని వ్యాఖ్యలు.

హైదరాబాద్ : ఆడబిడ్డలను అక్రమ కేసులతో జైల్లో వేయడమే ఇందిరమ్మ రాజ్యమా..? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులో అరెస్టైన మహిళా జర్నలిస్టులు రేవతి, తన్వి యాదవ్‌లను చంచల్‌గూడ జైల్లో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మా రెడ్డి, ఎమ్మెల్సీలు నవీన్ కుమార్ రెడ్డి, డా. దాసోజు శ్రవణ్ తదితర బీఆర్ఎస్ సీనియర్ నేతలతో కలిసి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు.
ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ చెప్పిన ఇందిరమ్మ రాజ్యం అంటే ప్రజలంతా అదేదో సంక్షేమ రాజ్యం అని భ్రమపడ్డారు. కేసీఆర్ కంటే ఎక్కువ సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందేమోనని అపోహ పడ్డారు. కానీ ఇవాళ రేవంత్ రెడ్డి ప్రభుత్వ వ్యవహార శైలిని చూస్తుంటే ఇందిరమ్మ రాజ్యం అంటే ఎమర్జెన్సీ రోజులని గుర్తు తెచ్చేలా ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం తమను మోసం చేసిందని ప్రజలు అంతా భావిస్తున్నారు. ఓపెన్‌గా మాట్లాడుకుంటున్నారు. 420 హామీలను ఇచ్చి తమని మోసం చేసి కాంగ్రెస్ గద్దెనెక్కిందని ప్రజలు తమ ఆక్రోశాన్ని వెలిబుచ్చుతున్నారని కేటీఆర్ పేర్కొన్నారు.

2లో



## తులం బంగారం ఎక్కడ..?
### రేవంత్ రెడ్డిని నిలదీసిన ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్ : పేదింటి ఆడబిడ్డల వివాహానికి కల్యాణమస్తు స్కీం కింద తులం బంగారం ఇస్తామన్న హామీని రేవంత్ రెడ్డి సర్కార్ నిలుపుకోలేకపోయిందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ధ్వజమెత్తారు. అసెంబ్లీ ఆవరణలోని మీడియా పాయింట్ వద్ద ఎమ్మెల్సీ కవిత మాట్లాడారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు మ్యానిఫెస్టో ఖురాన్, బైబిల్, భగవద్గీతతో సమానం అని రేవంత్ రెడ్డి పలుమార్లు చెప్పారు. అది అబద్ధమని శాసనమండలి సాక్షిగా బయటపడింది. కల్యాణమస్తు పథకం ద్వారా లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇస్తామని అన్నారు. కల్యాణమస్తు పథకం గురించి మేం అడిగిన ప్రశ్నకు ఆ పథకాన్ని ప్రవేశపెట్టే ఆలోచన లేదని కౌన్సిల్ సాక్షిగా సమాధానం చెప్పారు. ఎన్నికలకు ముందు ఒక మాట ఎన్నికల తర్వాత మరో మాట మాట్లాడుతూన్నారు అని కవిత ధ్వజమెత్తారు.మహిళల పట్ల ఏ మాత్రం చిత్తశుద్ధి లేని ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని కవిత మండిపడ్డారు. ఆడపిల్లలకు అండగా కేసీఆర్ నిలబడ్డారు. తల్లిదండ్రులకు అండగా పాప పుట్టినప్పటి నుండి పెళ్లి అయ్యే వరకు కేసీఆర్ వారికి వెన్నుదన్నుగా నిలిచారు. మహిళ వ్యతిరేక ముఖ్యమంత్రిగా

## బీసీ రిజర్వేషన్ల బిల్లుకు భారాస సంపూర్ణ మద్దతు ఉంటుంది: హరీశ్‌రావు



హైదరాబాద్: బీసీ రిజర్వేషన్ల బిల్లుకు భారాస సంపూర్ణ మద్దతు ఇస్తుందని మాజీ మంత్రి, ఆ పార్టీ ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. బీసీలకు విద్య, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చినప్పుడు, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల ఫలాలు అందినప్పుడే బీసీలు సంతోషిస్తారని అన్నారు. ఈ అంశంపై శాసనసభలో ఏకగ్రీవ తీర్మానానికి, పార్లమెంట్‌లో పోరాటానికి భారాస కలిసి వస్తుందన్నారు. బీసీ రిజర్వేషన్ల బిల్లుకు ఏకగ్రీవంగా మద్దతు తెలుపుతూ ఓటేస్తామని చెప్పారు. బిల్లుపై రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో ఒత్తిడి తీసుకురావాలని హరీశ్‌రావు కోరారు.

## అసెంబ్లీలో కేటీఆర్, హరీశ్‌రావుతో తీన్మార్ మల్లన్న భేటీ

హైదరాబాద్ : అసెంబ్లీలోని బీఆర్ఎస్‌ఎల్పీలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుతో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కలిశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలతో తీన్మార్ మల్లన్న బీసీ బిల్లుపై చర్చించారు. బీసీ బిల్లుకు కేంద్రం చట్టబద్దత కల్పించేలా ఢిల్లీ వేదికగా తాము చేయబోయే ధర్నాకు మద్దతు ఇవ్వాల్సిందిగా బీఆర్ఎస్ నేతలను తీన్మార్ మల్లన్న కోరారు.
ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ.. ప్రభుత్వం బీసీ బిల్లు తేవటం కాదు. అవసరం అయితే కేంద్రంలో ఆమోదం కోసం జంతర్ మంతర్ దగ్గర ధర్నా చేయాలని సీఎంకు డిమాండ్ చేస్తున్నాం. మీ సహకారం కావాలని మల్లన్న కోరారు.



# సంపాదకీయం

## తెలంగాణలో ఎన్డీయే కూటమి?

అధ్యాపకులు, పట్టభద్రుల నియోజక వర్గాలకు ఉభయ తెలుగు రాష్ట్రాలలో జరిగిన ఎన్నికల్లో ఓటర్లు అధికార, ప్రతిపక్షాలకు తమదైన రీతిలో సంకేతాలు ఇచ్చారు. తెలంగాణలో ఓటర్ల తీర్పు ప్రతిపక్షానికి బలం చేకూర్చగా... ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం ప్రతిపక్షం తన పద్ధతులు మార్చుకోని పక్షంలో మనుగడే కష్టమన్న హెచ్చరికలు జారీ చేశారు. తెలంగాణలో అధ్యాపకులు, పట్టభద్రుల నియోజకవర్గాలు రెండింటినీ భారతీయ జనతా పార్టీ గెలుచుకోవడం ద్వారా మూడు ప్రధాన రాజకీయ పార్టీలలో తనదే పైచేయి అని రుజువు చేసుకుంది. ప్రధాన ప్రతిపక్షమైన భారత రాష్ట్ర సమితి ఈ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండటంతో ప్రధాన పోటీ కాంగ్రెస్, బీజేపీ మధ్యనే జరిగింది. అధికార కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల నియోజకవర్గంలోనే అధికారికంగా పోటీచేసింది. గత ఎన్నికల్లో గెలుచుకున్న ఈ స్థానాన్ని ఇప్పుడు కోల్పోవడం ఆ పార్టీకి దెబ్బ అనే చెప్పుకోవచ్చు. ఒకప్పుడు ఉత్తర తెలంగాణ భారత రాష్ట్ర సమితికి ఆయువుపట్టుగా ఉండేది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఉత్తర తెలంగాణలో బీఆర్ఎస్ పరాభవాన్ని మూటగట్టుకోగా బీజేపీ బలపడింది. ఇప్పుడు ఈ ఎన్నికల్లో ఆ పార్టీ తన స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకుంది. తెలంగాణ ఉద్యమానికి అండగా ఉండిన ఉమ్మడి వరంగల్ జిల్లాలో అధ్యాపకుల నియోజకవర్గంలో కూడా బీజేపీ పాగా వేసింది. భారత రాష్ట్ర సమితి ఎన్నికలకు దూరంగా ఉండటం బీజేపీకి కలిసొచ్చింది. ముక్కోణపు పోటీ జరిగి ఉంటే పరిస్థితి ఎలా ఉండేదో చెప్పలేంగానీ, బీజేపీ తెలంగాణలో విస్తరిస్తోందన్న అభిప్రాయం ఈ ఎన్నికల ఫలితాలతో ధ్రువపడింది. అదే సమయంలో కాంగ్రెస్ బలహీనపడుతోందన్న అభిప్రాయానికి బలం చేకూరుతోంది. ఇదే ధోరణి కొనసాగితే వచ్చే సార్వత్రిక ఎన్నికల నాటికి కాంగ్రెస్ పరిస్థితి ఏమిటన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఎన్నికలు ఎప్పుడు జరిగినా ప్రజలు తనకు బ్రహ్మరథం పట్టడానికి సిద్ధంగా ఉన్నారని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ శుక్రవారం నాడు చెప్పుకొన్నారు. అదే నిజమైతే పట్టభద్రుల నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ మద్దతు పొందిన బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ ఓడిపోకూడదు. ఆయన మూడో స్థానానికే పరిమితమయ్యారు. దీంతో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న భారత రాష్ట్ర సమితి స్థానాన్ని భారతీయ జనతా పార్టీ ఆక్రమించబోతున్నదా? అన్న సందేహం సహజంగానే ఏర్పడుతుంది. ఆంధ్రప్రదేశ్‌తో పోల్చితే తెలంగాణలో బీజేపీ మొదటి నుంచి కొంత బలంగానే ఉంది. ఇటీవలి కాలంలో ఆ పార్టీ శాసనసభలో కూడా బలం పెంచుకుంది. దీంతో వచ్చే ఎన్నికల నాటికి రాజకీయ సమీకరణాలు ఎలా ఉండబోతున్నాయనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

**తెలంగాణలో నేతల సన్నాహాలు!**

జాతీయ స్థాయిలో ఎన్డీయేను పటిష్ఠం చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ భావిస్తున్నందున వచ్చే ఎన్నికల నాటికి తెలంగాణలో కూడా ఎన్డీయే ప్రయోగం అమలు చేస్తారా? అన్న ప్రశ్న కొన్ని రోజులుగా వినిపిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడి ఘన విజయం సాధించాయి. తెలుగుదేశం పార్టీకి సొంతంగా మెజారిటీ సమకూరినప్పటికీ ఎన్డీయే కూటమిగానే ముందుకెళుతున్నాయి. ఇదే ప్రయోగాన్ని తెలంగాణలో కూడా అమలు చేస్తే... అన్న చర్చ ఇప్పుడు ఆ మూడు పార్టీలలో నడుస్తోంది. తెలంగాణలో బీజేపీ సంస్థాగతంగా బలంగా ఉండగా, తెలుగుదేశం పార్టీ ఓట్ల పరంగా అంతో ఇంతో బలంగా ఉంది. జనసేనకు కూడా తెలంగాణలో కొన్ని ఓట్లు ఉన్నాయి. గత శాసనసభ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఎన్నికలకు దూరంగా ఉండటంతో అది కాంగ్రెస్ పార్టీకి కలిసొచ్చింది. తెలుగుదేశం పార్టీ సొంతంగా పోటీ చేస్తే ఒక్క సీటు కూడా గెలుచుకోకపోవచ్చునుగానీ, ప్రధాన పార్టీతో జతకట్టి పోటీ చేస్తే ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయగలదు. ఈ నేపథ్యంలో తెలంగాణలో మాత్రం ఎన్డీయే కూటమి ఎందుకు ఏర్పడకూడదు? అన్న ప్రశ్న ఇటీవలి కాలంలో వినపడుతోంది. గతంలో కలిసి పోటీ చేద్దామని తెలుగుదేశం అధినేత చంద్రబాబు ప్రతిపాదించగా బీజేపీ రాష్ట్ర నాయకుల సూచన మేరకు ఆ పార్టీ అగ్రనేతలు తిరస్కరించారు. దీంతో బీజేపీ ఒంటరిగానే పోటీ చేసింది. గత ఎన్నికల్లో జనసేనతో కలసి పోటీ చేసినా పెద్దగా ఉపయోగపడలేదు. దీంతో తెలుగుదేశం పార్టీకి ఉన్న ఓటర్ల ప్రాధాన్యతను బీజేపీ నాయకులు కూడా గుర్తించారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణలో కూడా పోటీ చేస్తామన్న అభిప్రాయాన్ని చంద్రబాబు ఈ మధ్య వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణలో ఎన్డీయే కూటమి రూపుదిద్దుకోబోతున్నదని పసిగట్టడం వల్లనే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇటీవల మాట్లాడుతూ, "తెలంగాణలో చంద్రబాబు రాజకీయం చేయాలనుకుంటే సహించేది లేదు" అని వ్యాఖ్యానించారు. ఆయన చంద్రబాబును కేవలం సెంటిమెంటు కోసమే వ్యతిరేకించడం లేదు. ఎన్డీయే కూటమి ఏర్పడితే తెలుగుదేశం, బీజేపీలలో చేరడానికి బీఆర్ఎస్‌కు చెందిన పలువురు నాయకులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇందులో ఎమ్మెల్యేలు కూడా ఉన్నారు. వచ్చే ఎన్నికల నాటికి ఎన్డీయే కూటమి ఏర్పడుతుందని, ఆ కారణంగానే తాను తెలుగుదేశం పార్టీలో చేరే ఆలోచన చేస్తున్నానని కొంతకాలం క్రితం బీఆర్ఎస్‌కు చెందిన ఎమ్మెల్యే ఒకరు నాతో చెప్పారు. అప్పట్లో ఆయన చెప్పిన మాటలు టూ ఎర్లీగా అనిపించాయిగానీ, ఇప్పుడు పరిస్థితులు వేగంగానే మారుతున్నాయి. బీజేపీ అగ్ర నాయకత్వం ఆలోచనలు కూడా మారాయంటున్నారు. తెలంగాణలో ఎన్డీయే కూటమి ఏర్పడితే ప్రధానంగా నష్టపోయేది కేసీఆర్ మాత్రమే. అందుకే ఆయన చంద్రబాబుకు తెలంగాణలో ఏం పని అని మళ్లీ ప్రశ్నించడం మొదలు పెట్టారు. ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పుకోవాలి! బీజేపీతో కలసి వచ్చే ఎన్నికల్లో పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నామని బీఆర్ఎస్ నుంచి సంకేతాలు వెళ్లినా... బీజేపీ అగ్ర నాయకత్వం పట్టించుకోలేదు. తెలంగాణలో కేసీఆర్ శకం ముగిసిపోవాలని ఆ పార్టీ కోరుకుంటోంది. తెలుగుదేశం, జనసేనను కలుపుకొన్నా తామే పెద్దన్న పాత్రను పోషించవచ్చునని బీజేపీ నాయకులు కూడా భావిస్తున్నారు. ఈ పరిణామాలను గమనిస్తున్న కేసీఆర్ 'ఇక లాభం లేదు %-% జనంలోకి వెళ్లాలి' అని నిర్ణయించుకున్నారు. ఇక మీదట శాసనసభకు కూడా హాజరవుతానని ఆయన తాజాగా ప్రకటించారు. తెలంగాణలో ఎన్నికలకు ఇంకా మూడున్నరేళ్ల వ్యవధి ఉంది. ఈ మూడున్నరేళ్లలో ఏదైనా జరగవచ్చు.

**రేవంత్‌కూ హెచ్చరిక...**

ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలతో బీజేపీ ప్రస్తుతానికి మంచి ఊపు మీద ఉంది. ఇప్పుడు తెలంగాణలో కూడా ఎన్డీయేకు పురుడు పోయాలన్న ఆలోచన ఊపందుకుంటున్నందున కేసీఆర్ మాత్రమే కాదు%-% ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా మేల్కొనాల్సిన అవసరం ఉంది. కాంగ్రెస్ పార్టీలో ప్రస్తుతం ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వపరమైన, విధానపరమైన విషయాలను కూడా ముఖ్యమంత్రికంటే ముందుగా మంత్రులు, ఇతరులు ప్రకటిస్తున్నారు. దీంతో ప్రభుత్వ రథసారథి ఎవరన్న ప్రశ్న సహజంగానే తలెత్తుతోంది. ఈ కారణంగా కాంగ్రెస్ పార్టీ బలహీనపడుతోందన్న అభిప్రాయం బలపడుతోంది. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఇప్పటికైనా మేల్కొని, రాష్ట్ర నాయకత్వాన్ని పటిష్ఠం చేసే దిశగా చర్యలు తీసుకోని పక్షంలో పరిస్థితి చేయి దాటిపోయే ప్రమాదం లేకపోలేదు. స్థానిక సంస్థల ఎన్నికలకు గడువు ముగిసినప్పటికీ ఎన్నికలు జరిపించడానికి కాంగ్రెస్ పార్టీ సాహసించలేక పోతున్నదన్నది వాస్తవం. ఈ నేపథ్యంలో తెలంగాణలో ఎన్డీయే కూటమి రూపుదిద్దుకుంటే రాజకీయ సమీకరణాలు వేగంగా మారే అవకాశం ఉంది. ఇప్పుడు తనతో ఉన్న ఎమ్మెల్యేలు కూటమి వైపు చూడకుండా రేవంత్ రెడ్డి ఎంతవరకు కట్టడి చేస్తారో తెలియదు. మరోవైపు గత ఎన్నికల తర్వాత కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలలో కొందరు పునరాలోచనలో పడ్డారు. ఈ పరిణామం కాంగ్రెస్ పార్టీకి ఇబ్బందికరంగా పరిణమించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విషమ పరీక్షను ఎదుర్కొని ప్రభుత్వాన్ని, పార్టీని ఎలా కాపాడుకుంటారో వేచి చూడాలి.

ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే, ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలతో అధికార ఎన్డీయే కూటమికి వెయ్యి ఏనుగుల బలం చేకూరింది.

# అబద్ధాల పునాదుల మీద మేం ప్రభుత్వాన్ని నడపలేం: సీఎం రేవంత్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి

సీఎం మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటైన తొలి ఏడాదిలోనే 54 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని సీఎం అన్నారు. తొలి ఏడాదిలోనే ఇంత భారీ సంఖ్యలో ఉద్యోగాలు ఇచ్చిన రాష్ట్రం మరొకటి లేదన్నారు. రాష్ట్రంలో 50లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, 43 లక్షల కుటుంబాలకు రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నామన్నారు. త్వరలోనే స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్న 65 లక్షల మంది మహిళలకు 1.20 కోట్ల నాణ్యమైన చీరలు పంపిణీ చేయనున్నట్లు సీఎం వెల్లడించారు. రాష్ట్రంలోని ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

### గత ప్రభుత్వం భారీగా అవినీతి, దుబారాకు పాల్పడింది..

"దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ఇన్నేళ్లలో ఇప్పటివరకూ కులగణన జరగలేదు. సమాజానికి ఎక్స్ రే వంటి కులగణన దేశమంతా జరగాలని రాహుల్ గాంధీ చెప్పారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ.. అసెంబ్లీలో బిల్లు కూడా ప్రవేశపెట్టాం. ఎస్సీల వర్గీకరణ కోసం 35 ఏళ్లుగా ఉద్యమం సాగుతోంది. దశాబ్దాలుగా నానుతున్న ఎస్సీ వర్గీకరణపై కూడా అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టాం. అబద్ధాల పునాదుల మీద మేము ప్రభుత్వాన్ని నడపలేం. గత ప్రభుత్వం భారీగా అవినీతి, దుబారాకు పాల్పడింది. దుబారా ఖర్చులను తగ్గించుకుంటూ అప్పులు చెల్లిస్తున్నాం. ఒక్క ఇసుక విక్రయంలోనే రోజువారీ ఆదాయం రూ.3 కోట్లు పెరిగింది. రాష్ట్రంలో జీఎస్టీ వసూళ్లలో 17 శాతం పెరుగుదల నమోదైంది. ధరల పెరుగుదలను నియంత్రించడంలో తెలంగాణ దేశంలోనే నంబర్ వన్‌గా ఉంది.

### మంత్రివర్గం నుంచి మంత్రులను తొలగిస్తేనే.. పట్టు ఉన్నట్టా?

నాకు పరిపాలనపై పట్టు రాలేదని కొందరు అంటున్నారు. మంత్రివర్గం నుంచి మంత్రులను తొలగిస్తేనే.. పట్టు ఉన్నట్టా? అధికారులను తొలగించి, బదిలీలు చేస్తేనే పాలనపై పట్టు సాధించినట్లు అవుతుందా? ఎలాంటి ఆరోపణలు లేకుండా ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తున్నాం. ప్రభుత్వ పథకాల్లో పారదర్శకంగా వ్యవహరించాలని మా ఎమ్మెల్యేలకు.. అసలైన అర్హులకు పథకాలు తప్పకుండా వర్తింపజేయాలని అధికారులకు చెబుతున్నాను. అన్నింటినీ సవ్యంగా సరిదిద్దుకుంటూ ముందుకు వెళ్లడమే నా విధానం. అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వంపై నమ్మకం కలిగించడమే మా లక్ష్యం" అని సీఎం అన్నారు.

### స్వయం ఉపాధిపైనా రాష్ట్ర ప్రభుత్వం దృష్టి: డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. "ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తూనే స్వయం ఉపాధి కల్పించాలనేదే ప్రభుత్వ లక్ష్యం. యువ వికాసం పథకాన్ని ఉపయోగించుకొని యువత ఉపాధి కల్పించుకోవాలి. ఉద్యోగాలు లభించక గ్రామీణ యువత ఇబ్బందులు ఎదుర్కొంటోంది. యువ వికాసం పథకాన్ని గ్రామీణ యువత సద్వినియోగం చేసుకోవాలి. ఏడాది వ్యవధిలోనే గ్రూప్-1 పరీక్షలు నిర్వహించి ఫలితాలు కూడా ఇచ్చాం. రాష్ట్రంలో ఒకప్పుడు ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వాలని ధర్నాలు జరిగేవి. ఇప్పుడు నోటిఫికేషన్ల మధ్య కొంత గ్యాప్ ఇవ్వాలని ధర్నాలు జరిగే రోజులొచ్చాయి. యువతకు ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాల కల్పనతో పాటు స్వయం ఉపాధిపైనా రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది" అని భట్టి అన్నారు.

### 'రాజీవ్ యువ వికాసం' .. ఎవరి కోసం.. ఎందుకు?

'రాజీవ్ యువ వికాసం' పథకంలో భాగంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం చేయనుంది. యువ వికాసానికి ఇవాళ్టి నుంచి ఏప్రిల్ 4 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఏప్రిల్ 6 నుంచి మే 30 వరకు లబ్ధిదారుల ఎంపిక, యూనిట్ల కేటాయింపు ప్రక్రియ ఉంటుంది.

కేటగిరి-1 కింద రూ.లక్ష వరకు రుణం.. 80 శాతం రాయితీ

కేటగిరీ-2 కింద రూ.2 లక్షల వరకు సాయం.. 70 శాతం రాయితీ

కేటగిరీ-3 కింద రూ.3 లక్షల వరకు సాయం.. 60 శాతం రాయితీ ఇవ్వనుంది.

## ఆడబిడ్డలను అక్రమ కేసులతో జైల్లో వేయడమే ఇందిరమ్మ రాజ్యమా? : కేటీఆర్

మొదటిపేజీ తరువాయి

**బజారు భాషలోనే మాట్లాడితే బాగుంటుందని..**

ముఖ్యమంత్రికి అర్థం కావడానికి ఆయన మాట్లాడే బజారు భాషలోనే మాట్లాడితే బాగుంటుందని కొంతమంది సామాన్యులు కూడా అదే భాషను ఉపయోగిస్తున్నారు. రాహుల్ గాంధీ చెప్పిన మొహబ్బత్‌కి దుకాన్ ఇదేనా అని ఇవాళ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. జనం నిలదీస్తే.. ప్రజలు ప్రశ్నిస్తే జర్నలిస్టులపై ఉక్కు పాదం మోపుతారా? జర్నలిస్టులను జైలుకు పంపుతారా? ఒకరిద్దరు జర్నలిస్టులను కాదు పదుల సంఖ్యలో జర్నలిస్టులపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం అక్రమ కేసులు, దాడులతో వేధిస్తుంది. ప్రభుత్వం మీద ప్రజల్లో ఉన్న అసహనాన్ని చూపిస్తున్నందుకే యూట్యూబ్ జర్నలిస్టులపై రేవంత్ రెడ్డి అక్కసు వెళ్ళగక్కుతున్నారు అని కేటీఆర్ మండిపడ్డారు.

**ప్రజలు గొంతు విప్పితే మాత్రం తట్టుకోలేకపోతున్నాడు..**

6 గ్యారంటీలతోపాటు ఏడో గ్యారెంటీ ప్రజాస్వామ్యమని పెద్ద పెద్ద మాటలు చెప్పిన రేవంత్ రెడ్డి, ప్రజలు గొంతు విప్పితే మాత్రం తట్టుకోలేకపోతున్నాడు. తన భార్యా పిల్లలను దూషిస్తున్నారని బాధపడుతున్న రేవంత్ రెడ్డి గతంలో మా మీద అవాకులు చెవాకులు మాట్లాడిన సంగతి మర్చిపోయారా? మా పిల్లల ప్రస్తావన తీసుకొచ్చినప్పుడు రేవంత్‌కు కుటుంబం గుర్తుకు రాలేదా? నువ్వు మాట్లాడితే మంచిది ఇంకొకరుమాట్లాడితే మంచిది కాదా..? రేవంత్ రెడ్డి ఇకనైనా బుద్ధి తెచ్చుకోవాలి. సిగ్గు తెచ్చుకోవాలి అని కేటీఆర్ సూచించారు.


**రేపు రేవంత్ రెడ్డి కూడా ఇదే శాస్తి జరుగుతుంది..**

బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఇవాళ రేవతి, తన్వి యాదవ్‌లను కలిసి వారికి ధైర్యం చెప్పాం. వారి తరపున న్యాయపోరాటం చేస్తాం. జైల్లో పెడతామంటే భయపడడానికి ఇక్కడ ఎవరూ లేరు. మేమంతా ఉద్యమాల నుంచి వచ్చిన వాళ్ళం. జనం నుంచి వచ్చినవాళ్లం. కేసులకి బెదిరింపులకి భయపడే వాళ్ళంకాదు. రేపు రేవంత్ రెడ్డి కూడా ఇదే శాస్తి జరుగుతుంది. ఆయనకు వంతపడే వాళ్లకు కూడా జరుగుతుంది. రేవతి, తన్వియాదవ్‌లకు జరిగిందే రేపు మిగితా జర్నలిస్టులకు కూడా జరగవచ్చు. ప్రజల ఆక్రోశాన్ని చూపించడమే వారు చేసిన తప్పా? అని కేటీఆర్ నిలదీశారు.

**తెలంగాణ రైజింగ్ కాదు.. తెలంగాణ ఈజ్ ఫాలింగ్..**

రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేసేదాకా కచ్చితంగా ప్రశ్నిస్తూనే ఉంటాం.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత తెలంగాణ అన్ని రంగాల్లో విఫలమైందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఒప్పుకున్నాడు. రూ. 71 వేల కోట్ల ఆదాయం తగ్గిందని నిన్న స్టేషన్ ఘన్‌పూర్‌లో రేవంత్ రెడ్డి చెప్పిండు. రేవంత్ అసమర్థ విధానాల వల్లనే ఆదాయం తగ్గింది. తాము వచ్చాక తెలంగాణలో అన్ని రంగాలు చాలా బాగున్నాయి అని చెప్పుకున్న రేవంత్ రెడ్డి 71 వేల కోట్ల ఆదాయం ఎలా తగ్గిందో చెప్పాలి. తెలంగాణ రైజింగ్ కాదు తెలంగాణ ఈజ్ ఫాలింగ్ అని నిన్ననే ముఖ్యమంత్రి కన్ఫర్మ్ చేశారు. పిచ్చోడైన రేవంత్ రెడ్డి చేతిలో రాయిల తెలంగాణ మారింది. జర్నలిస్టులను జైల్లో పెడతామని నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తున్న రేవంత్ రెడ్డికి కాలమే సమాధానం చెబుతుంది. దయచేసి మీడియా గొంతు విప్పి రేవంత్ రెడ్డి అక్రమాలపై మాట్లాడాలి అని కేటీఆర్ పేర్కొన్నారు.

## కేంద్ర ప్రభుత్వం ప్రజలను దోచుకుంటోంది: ఖర్గే



ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టినప్పటికీ.. దాని ప్రయోజనాలను ప్రజలకు చేరవేయడం లేదంటూ కేంద్రంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శలు గుప్పించారు.

దిల్లీ: కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై మరోసారి విరుచుకుపడ్డారు. ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టినప్పటికీ.. దాని ప్రయోజనాలను ప్రజలకు చేరవేయడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ముడి చమురు ధరలు 42 నెలల కనిష్ఠ స్థాయికి చేరుకున్నాయని పలు మీడియా సంస్థలు వెల్లడించిన నివేదికలను ఉటంకించారు. భాజపా ప్రభుత్వం ఇంకెన్నాళ్లు ప్రజల నుంచి వసూళ్లకు పాల్పడుతూ, వారిని దోచుకుంటుందని ప్రశ్నించారు.

"ముడి చమురు ధరలు నిరంతరం తగ్గుతూనే ఉన్నాయి. పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గట్లేదు. మే 2014 నుంచి సుమారు 34 శాతం తగ్గాయి. పదేళ్లలో కేంద్ర ప్రభుత్వం రూ.36 లక్షల కోట్ల పన్ను వసూలు చేసింది. పెరుగుతున్న ద్రవ్యోల్బణం కారణంగా ప్రజలు కన్నీరు పెట్టుకుంటున్నారు. ఇంకా ఈ దోపిడీ ఎంతకాలం కొనసాగుతుంది" అని ఖర్గే సోషల్ మీడియా వేదికగా ప్రశ్నించారు.

కేంద్ర ప్రభుత్వంపై దిల్లీ విమానాశ్రయం దావా

కేంద్ర ప్రభుత్వం త్వరలో అమల్లోకి తేనున్న లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై మాట్లాడుతూ.. కేంద్రం దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేస్తోందని అన్నారు. దేశ వనరులు, పాలనలో అన్ని రాష్ట్రాలకు సమన్యాయం ఉండాలని పేర్కొన్నారు. "జనాభా ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేయడం వల్ల దక్షిణాదిలో ఎమ్మెల్యే సీట్ల సంఖ్య తగ్గే అవకాశం ఉంది. కానీ ఉత్తరాదిలో వాటి సంఖ్య పెరుగుతుంది. దీని వల్ల దేశంలో సమన్యాయం లేకుండా పోతుంది. కాబట్టి అటువంటివి జరగకుండా సామాజిక సమానత్వం కోసం అందరు కలిసికట్టుగా పోరాడాలి" అని ఖర్గే పిలుపునిచ్చారు.

## చర్లపల్లి రైల్వే టెర్మినల్‌కు పొట్టి శ్రీరాములు పేరు పెడదాం: సీఎం రేవంత్ ప్రతిపాదన

మొదటిపేజీ తరువాయి

తెలుగు రాష్ట్రాల్లో ఒకే పేరుపై యూనివర్సిటీలు, సంస్థలు ఉంటే పరిపాలనా పరమైన సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశముందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లో ఒకే పేరుపై యూనివర్సిటీలు, సంస్థలు ఉంటే పరిపాలనా పరమైన సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశముందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దాన్ని పరిష్కరించేందుకే రాష్ట్రంలోని యూనివర్సిటీలు, సంస్థలకు తెలంగాణకు సంబంధించిన పేర్లు పెడుతున్నామని చెప్పారు. శాసనసభలో ఎస్సీ వర్గీకరణ, బీసీ రిజర్వేషన్, తెలుగు వర్సిటీ పేరు మార్పు తదితర బిల్లులు ప్రవేశపెట్టిన నేపథ్యంలో సీఎం మాట్లాడారు. చర్లపల్లి రైల్వే టెర్మినల్‌కు పొట్టి శ్రీరాములు పేరు పెట్టాలని కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదిస్తున్నట్లు చెప్పారు.

"తెలంగాణ ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో అనేక యూనివర్సిటీలకు పేర్లు మార్చుకున్నాం. పరిపాలనా సౌలభ్యం కోసమే కొన్ని వర్సిటీలకు ప్రొఫెసర్ జయశంకర్, కొండా లక్ష్మణ్ బాపూజీ, పీవీ నరసింహారావు, కాళోజీ నారాయణరావు పేర్లు పెట్టుకున్నాం. అదే ఒరవడిలో పొట్టి శ్రీరాములు తెలుగు వర్సిటీకి సురవరం ప్రతాప్‌రెడ్డి పేరు పెడుతున్నాం. తెలంగాణ సమాజానికి ఆయన ఎంతో సేవ చేశారు. గోల్కొండ పత్రికను సురవరం నడిపారు. నిజాంకు వ్యతిరేకంగా పోరాడారు. పొట్టి శ్రీరాములు వర్సిటీ పేరు మార్చడం ఎవరికీ వ్యతిరేకం కాదు.

దివంగత మాజీ సీఎం రోశయ్య, ఆర్యవైశ్య సమాజం పట్ల ప్రభుత్వానికి అపారమైన గౌరవం, నమ్మకం, విశ్వాసం ఉంది. కులం, మతం పేరుతో రాజకీయ ప్రయోజనాలు పొందాలనుకోవడం సరికాదు. చర్లపల్లి రైల్వే టెర్మినల్‌కు పొట్టి శ్రీరాములు పేరు పెట్టాలని కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కు లేఖ రాస్తా. దేశం కోసం ఆయన చేసిన త్యాగాలను గుర్తుచేసుకుందాం. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకురావాలని కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌ను కోరుతున్నా.

నేచర్ క్యూర్ ఆస్పత్రికి రోశయ్య పేరు

బల్కంపేట్‌లో నేచర్ క్యూర్ ఆస్పత్రికి రోశయ్య పేరు పెడతాం. ఆయన సుదీర్ఘ అనుభవం గల నేత. గవర్నర్‌గా, సీఎంగా ఎన్నో సేవలందించారు. నేచర్‌క్యూర్ ఆస్పత్రి సమీపంలో రోశయ్య విగ్రహం నెలకొల్పి అధికారికంగా జయంతి, వర్ధంతి కార్యక్రమాలు నిర్వహిస్తాం" అని సీఎం ప్రకటించారు.

## తెలంగాణ శాసనసభ ముందుకు ఎస్సీ వర్గీకరణ, బీసీ రిజర్వేషన్ బిల్లులు

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: తెలంగాణ శాసనసభ లో కీలక బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. రాష్ట్రంలో సామాజిక వర్గాల సంక్షేమాన్ని కాంక్షిస్తూ ఎస్సీ వర్గీకరణ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లతో పాటు దేవాదాయ చట్ట సవరణ బిల్లులను ప్రభుత్వం సభ ముందుకు తీసుకొచ్చింది.

ఎస్సీ వర్గీకరణ బిల్లును మంత్రి దామోదర రాజనర్సింహ, బీసీ రిజర్వేషన్ల బిల్లును మంత్రి పొన్నం ప్రభాకర్ సభలో ప్రవేశపెట్టారు. దేవాదాయ చట్టసవరణ బిల్లును మంత్రి కొండా సురేఖ శాసనసభ ముందుకు తీసుకొచ్చారు. వీటితో పాటు తెలుగు యూనివర్సిటీకి సురవరం ప్రతాప్‌రెడ్డి పేరు పెట్టే బిల్లును ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఆ తర్వాత వీటిపై పలువురు సభ్యులు మాట్లాడారు. అనంతరం ఈ బిల్లులు సభ ఆమోదం పొందినట్లు స్పీకర్ ప్రసాద్‌కుమార్ ప్రకటించారు.

## తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలపై శ్రీవారి దర్శనం.. తితిదే అనుమతి

మొదటిపేజీ తరువాయి

తిరుమల: తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలపై శ్రీవారి దర్శనం కల్పించేందుకు అనుమతించనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) వెల్లడించింది. ఈ మేరకు తితిదే ం ప్రకటన విడుదల చేసింది. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రకటనలో పేర్కొంది. తెలంగాణ నేతల సిఫార్సు లేఖలపై వీఐపీ బ్రేక్ దర్శనాలకు సంబంధించి ఆది, సోమవారం (సోమ, మంగళవారం దర్శనాలకు) మాత్రమే లేఖలు స్వీకరిస్తామని తెలిపింది. బుధవారం, గురువారం రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనాలకు (ఏ రోజుకు ఆ రోజే) లేఖలు అనుమతిస్తామని స్పష్టం చేసింది. నిర్దేశిత రోజుల్లో ప్రజాప్రతినిధులకు సంబంధించి ఒక లేఖ మాత్రమే (ఆరుగురు భక్తులకు మించకుండా) స్వీకరిస్తామని వెల్లడించింది. ఈ విధానం మార్చి 24 నుంచి అమలు చేయనున్నట్లు తితిదే వెల్లడించింది.

ఇప్పటివరకు సోమవారం వీఐపీ బ్రేక్ దర్శనానికి గాను ఆదివారం ఏపీ ప్రజాప్రతినిధుల నుంచి సిఫార్సు లేఖలు స్వీకరిస్తున్నారు. ఇకపై శనివారం (ఆదివారం దర్శనం కోసం) స్వీకరించనున్నట్లు తితిదే పేర్కొంది. తిరుమలలో అందుబాటులో ఉన్న వసతి సౌకర్యాలు, ఇతర భక్తుల దర్శన సమయాలను దృష్టిలో పెట్టుకొని, అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఈ మార్పులను భక్తులు దృష్టిలో ఉంచుకొని తిరుమల తిరుపతి దేవస్థానానికి సహకరించాలని కోరింది.

## తెలంగాణ కాంగ్రెస్ బలమూ బలహీనత

# ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి

**శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్**

**తెలంగాణ ఏర్పడింది..**
**తెలంగాణ ఇచ్చింది మేమేనని కాంగ్రెస్,**
**తెచ్చింది మేమని టీఆర్ఎస్ చెప్పుకోవడం మనకు తెలుసు.**
**తెలంగాణ వాదనకు,సాధనకు కారణం మేమేనని బిజెపి అనడం కూడా మనకు తెలుసు.**
**ఇప్పుడు చర్చ ఇందులోని నిజానిజాల గురించి కాదు.**

**తెలంగాణ రాజకీయాల గురించి.**




టీఆర్ఎస్ అలియాస్ బిఆర్ఎస్ పదేళ్ల పాలనను అంతమొందించి అధికారం సాధించడానికి కాంగ్రెస్ తీవ్ర ప్రయత్నం చేసింది. బిజెపి కూడా ఇదే ప్రయత్నం చేసింది.తెలంగాణ లో మొదటి నుండి కాంగ్రెస్ కు జనంలో ఒక ఓటు బ్యాంక్ ఉన్నది.కానీ బీఆర్ఎస్ ఆ ఓటును చాలా వరకు హైజాక్ చేసింది. తెలంగాణ కాంగ్రెస్ లో ప్రజాభిమానం కలిగిన నాయకుడు కరువైన పరిస్థితిలో రేవంత్ రెడ్డి కాంగ్రెస్ లో చేరడంతో ఒక ఊపు వచ్చింది.కేసీఆర్ అతని కుటుంబ సభ్యుల మాటకారి తనాన్ని ఎదుర్కోగలిగిన మొనగాడు కాంగ్రెస్ కు దొరికాడని అందరూ భావించారు.దేశంలో ఇప్పుడు మిగిలిన సీనియర్ నాయకులు బీహార్ నితీశ్ కుమార్,ఆంధ్రా చంద్రబాబు, బెంగాల్ మమత, ఒరిస్సా నవీన్ పట్నాయక్,తెలంగాణ కేసీఆర్ లు మాత్రమే.ఇక ప్రధాని నరేంద్ర మోడీ అసలు సిసలు దేశ నాయకుడని మనదేశం ప్రపంచం ఒప్పుకుంటున్నది.తెలంగాణలో కాంగ్రెస్ కు ఓటు బ్యాంక్ ఉన్నది,కానీ అందరికీ ఆమోదయోగ్యమైన నాయకుడు కాంగ్రెస్ కు కరువైన సమయంలో రేవంత్ రెడ్డి రంగ ప్రవేశం రాజకీయ దిశను మార్చింది.కాంగ్రెస్ అధికార సాధనకు రేవంత్ ఒక్కడే కాంగ్రెస్ లో కేంద్ర బిందువుగా మారాడు.కాంగ్రెస్ ను గెలిపించాడు.అధికారం అందుకున్న తర్వాత రేవంత్ రెడ్డికి అసలు సవాలు మళ్ళీ పార్టీ నుండి మొదలయ్యింది.గెలుపుకు కారణం రేవంత్ అయితే, ప్రజల్లో ప్రభలుతున్న వ్యతిరేకత కు కూడా రేవంత్ రెడ్డి కారణం అని విమర్శలు మొదలయ్యాయి.

ప్రకటించిన ఉచిత పథకాల అమలు కాంగ్రెస్ కు సవాల్ గా మారింది.మెల్ల మెల్లగా రేవంత్ రెడ్డి పైన అతని కుటుంబ సభ్యులపైనా అవినీతి ఆరోపణలు చక్కర్లు కొడుతున్నాయి.ఉప ముఖ్యమంత్రి బట్టి కూడా ఒక అవినీతి కేంద్రమని ఆరోపణలు బహిరంగంగా వినిపిస్తున్నాయి.నారాయణ, శ్రీ చైతన్య కాలేజీల్లో ఫలితాల ప్రకటనల మాదిరిగా 5,10,15,20 శాతం అంటూ కమీషన్లు తీసుకుంటున్నారని ప్రత్యర్థుల ఆరోపణలు విరివిగా వినిపిస్తున్నాయి.అయినా ప్రజలు ఈ విషయాలు పట్టించుకోవడం లేదు.మాకు ఇస్తానన్న ఉచితాలు ఏవి అని ప్రజలు డైరెక్ట్ గా పాపం రేవంత్ రెడ్డిని ప్రశ్నిస్తున్నారు.రేవంత్ రెడ్డిపై విమర్శల వీడియోలు సోషల్ మీడియాలో విరివిగా చక్కర్లు కొడుతున్నాయి.ప్రాంతీయ పార్టీలో పనిచేసిన అనుభవం రేవంత్ రెడ్డిది. అయినా తొందరగానే కాంగ్రెస్ జాతీయ రాజకీయాలను ఒంటబట్టించుకున్నారు.గతంలో అంజయ్య ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి పార్టీ స్వభావాన్ని కాంగ్రెస్ మళ్ళీ అనుసరించడం ప్రారంభమయ్యింది.స్వర్గీయ రాజీవ్ గాంధీ జీవించి ఉన్నప్పటి గ్రూప్ రాజకీయాలు మళ్ళీ కాంగ్రెస్ లో తలెత్తాయి. గ్రూప్ రాజకీయాలు కాంగ్రెస్ కవచ కుండలాలు.

**రెండవ శక్తి కేంద్రంగా దీపా దాస్**

రేవంత్ రెడ్డి మోనోపలిని ధిక్కరించి పార్టీ పరిశీలకురాలు దీపాదాస్ కేంద్ర పార్టీ ప్రతినిధిగా మరొక అధికార కేంద్రంగా అవతరించింది.ఇలా రెండు అధికార కేంద్రాల వల్ల రేవంత్ రెడ్డి ప్రతిష్టను పలచన చేసే కుట్రలు తలెత్తాయి.

**మీనాక్షి నటరాజన్ రంగ ప్రవేశం**

సరళ పనితీరుకు మీనాక్షి నటరాజన్ ను సింబల్ గా చూపిస్తూ మీనాక్షి రంగ ప్రవేశం చేసింది.ఆమె సింప్లిసిటీని ఒక ఆకర్షణగా కాంగ్రెస్ ప్రచారం చేసుకుంటున్నది.మీనాక్షి నిజంగా సింప్లిసిటీ ప్రదర్శించినా పార్టీకి ఏ మేరకు మేలు జరుగుతుందో తెలియదు. నాయకుల పనితీరు మాత్రమే జనాలకు అవసరం.మీనాక్షి ఎమ్మెల్సీ ఎన్నికల్లో నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలకు,నాయకులకు ప్రాధాన్య మిచ్చింది అని కాంగ్రెస్ తరఫున ప్రచారం హోరెత్తింది.అందులో శంకర్ నాయక్ ఒక్కడే మొదటి నుండి అంకితమైన కాంగ్రెస్ నాయకుడు. రాములమ్మ విజయశాంతి , అద్దంకి దయాకర్ లు ఇద్దరూ ఇంపోర్టెడ్ క్వాలిటీ సరుకే కదా అనే విమర్శలు మెల్ల మెల్లగా వినిపించడం మొదలయ్యింది.రేవంత్ రెడ్డి కోరుకున్న సూచించిన ఒకే ఒక్క అభ్యర్థి వేం నరేందర్ రెడ్డి పేరు తిరస్కరించబడిందని వినిపిస్తున్న మాట.రేవంత్ రెడ్డి తెలుగు దేశం నుండి వచ్చాడని, ఎప్పటికైనా కాంగ్రెస్ కొంప ముంచుతాడని ప్రచారం మౌన ప్రచారం చేసిన వారు ఈ ఇద్దరి ఎంపికతో నిరుత్తరులయ్యారు.

**- ఎవరేమన్నా రేవంత్ రెడ్డి మాత్రమే దిక్కు**

కాంగ్రెస్ కు ఇప్పుడు మిగిలిన ఏకైక ప్రజా నాయకుడు రేవంత్ రెడ్డి మాత్రమే. రేవంత్ స్థానంలో ఇంకొక కాంగ్రెస్ నాయకుడు ఎవరన్నది కోటి డాలర్ల ప్రశ్న.నిధుల లోపం పాలనకు అడ్డం అని అందరికీ తెలిసిన బహిరంగ రహస్యం. ఆర్థిక వనరుల లోటు ఉచిత పథకాల అమలుకు అవరోధంగా మారింది.ఉచిత పథకాల ప్రకటన చేసింది రేవంత్ కాదు. కాంగ్రెస్ అధిష్టానం.ముఖ్యంగా రాహుల్ గాంధీ.తెలంగాణలో ఉచిత పథకాల ప్రకటన రేవంత్ చేస్తే, కర్నాటకలో ఈ ఉచిత పథకాల ప్రకటన చేసింది ఎవరు? కాంగ్రెస్ అధిష్టానం అన్న విషయం అందరికీ తెలుసు.కాంగ్రెస్ పాలిస్తున్న హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రంలో చివరికి ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి ఉంది. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సుఖ్ విందర్ సింగ్ సుక్కు అయితే రాష్ట్ర ఆర్థిక దివాలాకోరుతనాన్ని బహిరంగ పరిచిన విషయం కూడా అందరికీ తెలుసు.ఇక, తెలంగాణ మంత్రివర్గంలో ఐదుగురు మంత్రుల పనితీరు సరిగ్గా లేదని,వారిని మార్చబోతున్నారని వదంతులు వినిపిస్తున్నాయి.ఇది ఎవరి ప్రచారం. మీనాక్షి నటరాజన్ గనుక ఈ వాదనలకు తలొగ్గితే తెలంగాణలో కాంగ్రెస్ దీపం ఆరిపోవడం ఖాయం.తెలంగాణలో దిగజారిన కాంగ్రెస్ ప్రతిష్టకు కేవలం రేవంత్ రెడ్డిని కారణంగా చూపి, ముఖ్యమంత్రిని మారిస్తే తెలంగాణలో కాంగ్రెస్ మునుపటి కంటే అధికంగా దెబ్బతింటుందని, కాంగ్రెస్ కు తీరని నష్టం జరిగి తీరుతుందని రాజకీయ పండితుల విశ్లేషణ.తెలంగాణలో దొర్లిన పాలనా పరమైన అపశృతులను కాంగ్రెస్ సమిష్టిగా సవరించుకోవడం మంచిది. దాదాపు ఒకటిన్నర సంవత్సరాల కాంగ్రెస్ పాలన ముగిసింది.రాబోయే ఎన్నికల ముందు ఒక సంవత్సరం ఎన్నికల వాతావరణం ఆవహిస్తుంది.ఇక మిగిలిన ఈ రెండు సంవత్సరాల సమయంలో కాంగ్రెస్ గనుక సమిష్టిగా పనిచేయకపోతే రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో ఘోరమైన ఓటమి పొందడం జరిగి తీరుతుందని విశ్లేషకుల అభిప్రాయం.రేవంత్ రెడ్డి చంద్రబాబు,కేసీఆర్ ల పని తీరు తెలిసిన వాడు. ఆ రాజకీయ మెలుకువలతో కాంగ్రెస్ పార్టీని గెలుపు తీరం చేర్చినవాడు.మీనాక్షి నటరాజన్ ఎంత నిరాడంబరత ప్రదర్శించినా అది పార్టీ క్యాడర్ కు మాత్రమే ఆకర్షణీయంగా ఉంటుంది. ఆమె కేంద్ర పార్టీ ప్రతినిధి మాత్రమే.ఆమె ప్రజలకు జవాబు దారీ కాదు.ఆమె ఎంత సరళ స్వభావి అయినా జనానికి సంబంధం లేదు.రాష్ట్ర ముఖ్యమంత్రి మాత్రమే ప్రభుత్వానికి,పార్టీకి ఆధారం.తెలంగాణలో కాంగ్రెస్ గెలుపుకు రేవంత్ రెడ్డి హేతువు. కాంగ్రెస్ ఈ అంశాన్ని విస్మరిస్తే తెలంగాణలో కాంగ్రెస్ నష్ట పోవడం తప్పనిసరి.తెలంగాణ కాంగ్రెస్ పాలనా లోపాలకు ఒక్క రేవంత్ ను కారణంగా చూపితే, రాబోయే ఎన్నికల్లో ఓటమికి రేవంత్ రెడ్డి హేతువుగా మారతాడని రాజకీయ పండితుల నిశ్చితాభిప్రాయం.మీనాక్షి నటరాజన్ పరిశీలకురాలిగా రావడం పార్టీ అంశం. ఇది ప్రజలకు అవసరం లేని విషయం.ఏతా వాతా చెప్పొచ్చేదేమిటంటే రేవంత్ రెడ్డి తెలంగాణ కాంగ్రెస్ లో విస్మరించవీలులేని నాయకుడు.
రేవంత్ రెడ్డి లేకపోతే తెలంగాణలో కాంగ్రెస్ కు మళ్ళీ అధికారం దక్కడం ఒక కలగా మారుతుంది.. రేవంత్ లేకపోతే కాంగ్రెస్ భవిత స్మృతిలో మెదిలే వైభవం అని నిట్టూర్చాల్సిందే.

**ఇది తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాల పట్ల సామాన్య ప్రజల అభిప్రాయం.**

## మెట్టుపల్లి అయ్యప్ప స్వామి ఆలయ నూతన కార్యవర్గం

**ఆకుల రంజిత్, కరపత్రం ప్రతినిధి**



జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయ నూతన కార్యవర్గాన్ని ఆలయ వ్యవస్థాపకులు కోరుట్ల మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు సోమవారం ప్రకటించారు.ఆలయ 29వ వార్షిక ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయ నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. కార్యనిర్వాహణ కమిటీ అధ్యక్షులుగా గంగుల వివేక్, అధ్యక్షులుగా దొమ్మటి ప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షులుగా అంకతి భరత్ కుమార్, కార్యదర్శిగా ఉజ్జగిరి శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా చిలమంతుల శివ, కోశాధికారిగా బండారి మారుతి , కార్యవర్గ సభ్యులుగా బురా ప్రసాద్ గౌడ్ ,అవుట్ల లక్ష్మణ్, వాల్గోటు నరేష్ ,శివ శ్రీనివాస్, నత్తి నర్సయ్య, చేపూరి రాము, ద్యావనపల్లి గణేష్, నారోజు కిరణ్ ,చెట్లపల్లి దేవేందర్ గౌడ్, మణిదీప్, పుల్ల చిన్న గౌడ్, బి శరత్ రావు లతో పాటు. ప్రత్యేక ఆహ్వానితులు మంత్రి అంజయ్య గురుస్వామి, కోట బుచ్చి గంగాధర్, కూన గోవర్ధన్, కొమిరెడ్డి తిరుపతిరెడ్డి, మహాజన్ నరసింహులు లను కమిటీలోకి తీసుకున్నారు.
ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి కోసం కమిటీ అహర్నిశలు కృషి చేయాలని, భక్తులకు ఎలాంటి ఇక్కట్లు కలగకుండా చూసుకోవాలని పేర్కొన్నారు.

## డబ్బా గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మెన్ లుగా శంకర్, నరేష్



**ఆకుల రంజిత్, కరపత్రం ప్రతినిధి**

జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని డబ్బా గ్రామంలో రామాలయం ఆవరణంలో ఆదివారం ఏర్పాటు చేసుకున్న సమావేశంలో గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ లుగా జాన శంకర్, తేలు నరేష్ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామంలో నూతనంగా గ్రామ పెద్ద మనుషులుగా ఎన్నికైన వారినుండి, చైర్మన్ లను ఎన్నుకున్నారు. కాగా డబ్బా విడిసి చైర్మలుగా శంకర్ నరేష్ లు ఏకగ్రీవంగాఎన్నికయ్యారు. ఎన్నికైన నూతన చైర్మన్ లను మాజీ సర్పంచ్ పుప్పాల నర్సయ్య, గోపి రాజేందర్ లు శాలువాతో ఘనంగా సత్కరించారు.
ఎన్నికైన వారికి మాజీ సర్పంచ్ నర్సయ్య శుభాకాంక్షలు తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రజా ప్రతినిధుల సిఫార్సు లేఖలకు ఇకపై టిటిడిలో శ్రీవారి దర్శనం

**ఆకుల రంజిత్, కరపత్రం ప్రతి నిధి**

**- తెలంగాణ ప్రజా ప్రతినిధుల సిఫార్సు లేఖలకు శ్రీవారి దర్శనం**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రతినిధుల సిఫార్సు లేఖలకు శ్రీవారి దర్శనాన్ని టిటిడి కల్పించనుంది.
ఈ విధానం మార్చి 24 నుండి అమల్లోకి రానుంది.ఇందులో భాగంగా వీఐపీ బ్రేక్ దర్శనాలకు సంబంధించి తెలంగాణ ప్రజా ప్రతినిధుల నుండి సిఫార్సు లేఖలను ఆది, సోమ, వారాల్లో మాత్రమే స్వీకరించడం జరుగుతుంది.


**సోమ, మంగళవారం దర్శనాలకు**

అదేవిధంగా రూ. 300 దర్శనం టికెట్లకు సంబంధించి సిఫార్సు లేఖలను బుధ, గురు వారాలలో ఏరోజుకారోజు స్వీకరించడం జరుగుతుందని తెలియజేయడమైనది. ఒకరికి ఒక సిఫార్సు లేఖను మాత్రమే 06 మందికి మించకుండా స్వీకరించడం జరుగుతుంది.ఇప్పటివరకు సోమవారం విఐపి బ్రేక్ దర్శనానికి గాను ఆదివారం ఆంధ్ర ప్రజా ప్రతినిధుల నుండి స్వీకరిస్తున్న సిఫార్సు లేఖలు ఇకపై శనివారం స్వీకరించి,ఆదివారం నాడు దర్శనానికి అనుమతించబడతాయి.తిరుమలలో అందుబాటులో ఉన్న వసతి సౌకర్యాలను, ఇతర భక్తుల దర్శన సమయాలను దృష్టిలో ఉంచుకుని సుదీర్ఘంగా చర్చించి, అన్ని అంశాలను పరిగణలోకి తీసుకున్న అనంతరం టిటిడి ఈ మేరకు నిర్ణయించింది.ఈ మార్పులను భక్తులు దృష్టిలో ఉంచుకొని టీటీడీకి సహకరించవలసిందిగా కోరడమైనది.
ఈ సమాచారం టిటిడి ముఖ్య ప్రజా సంబంధాల అధికారిచే జారీ చేయడమైనది.

## నిందితులే నేరస్థులు.. కోర్టు శిక్ష ఖరారు

**ఆకుల రంజిత్, కరపత్రం ప్రతి నిధి**

- లైంగిక వేధింపులకు 2 నెలల జైలుశిక్ష
- ఒక్కొక్కరికి రూ.10 వేలు జరిమానా



మైనర్ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించి లైంగికంగా వేధించిన కేసులో ఇద్దరు నిందితులకు 2 నెలల జైలు శిక్ష, ఒక్కొక్కరికి పదివేల రూపాయలు జరిమానా ఇస్తూ నిన్న సోమవారం తీర్పు వెలువడింది.మెట్టుపల్లి పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన పిట్ల సూరి వయస్సు 21 సంవత్సరాలు, కొమిరి నరేష్ వయస్సు 20 సంవత్సరాలు అనే ఇద్దరు యువకులు మైనర్ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించి లైంగికంగా వేధించిన కేసులో నిందితులకు 2 నెలల జైలు శిక్ష , ఒక్కొక్కరికి పదివేల రూపాయలు జరిమానా విధిస్తూ జిల్లా జడ్జి శ్రీమతి నీలిమ గారు తీర్పునిచ్చారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
మంగళవారం మార్చి 18 2025

## తిరుపతి సేవలు పలువురికి ఆదర్శం..



– మాజీ జెడ్పిటిసి, టిపిసిసి సభ్యులు శ్రీనివాస్ గౌడ్..

**కరపత్రం శంకరపట్నం మార్చి 17**

సేవా భావంతో విద్యార్థులను ప్రోత్సహించేందుకు దుర్గపు తిరుపతి సేవలు పలువురికి ఆదర్శంగా నిలుస్తాయని శంకరపట్నం మండల మాజీ జడ్పిటిసి సభ్యులు బత్తిని శ్రీనివాస్ గౌడ్ కొనియాడారు. సోమవారం కరీంనగర్ జిల్లా, మానకొండూర్ నియోజకవర్గం ,శంకరపట్నం మండలం, తాడికల్ జిల్లా పరిషత్ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు తాడికల్ గ్రామ నివాసి, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి దుర్గపు తిరుపతి సేవా భావంతో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ ను పెన్నులను అందజేయడం పలువురికి ఆదర్శంగా తిరుపతి సేవలు నిలుస్తాయని, శ్రీనివాస్ గౌడ్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణ, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆడెపు అజయ్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## శంకరపట్నం డిప్యూటీ తాసిల్దార్ గా పార్థసారథి..

**కరపత్రం శంకరపట్నం మార్చి 17**



శంకరపట్నం మండలం డిప్యూటీ తాసిల్దార్ గా కె పార్థసారథి సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా డిటి పార్థసారథి మాట్లాడారు. సాధారణ బదిలీల్లో భాగంగా హుజురాబాద్ నియోజకవర్గం ఇల్లందకుంట డిప్యూటీ తాసిల్దార్ గ విధులు నిర్వహిస్తున్న తనను మానకొండూర్ నియోజకవర్గం శంకరపట్నం మండలం డిప్యూటీ తాసిల్దార్ గా ఉన్నతాధికారులు బదిలీ చేయడంతో డీటీగా బాధ్యతలు తీసుకున్నట్లు తెలిపారు.

## ప్రపంచ మానవ హక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా అమల

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని ఫిబ్రవరి 17:**



ప్రపంచ మానవ హక్కుల సంఘం తెలంగాణ రాష్ట్ర మహిళ విభాగ కార్యదర్శిగా గోదావరిఖనికి చెందిన సిరిమల్లె అమల నియమితులయ్యారు. ఈ మేరకు ఆ శాఖ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.బాలరాజు ఉత్తర్వులు జారీ చేశారు. కాగా మానవ హక్కుల పరిరక్షణ కోసం, మహిళ హక్కుల కొరకు తన వంతు కృషి చేస్తానని అమల తెలిపారు. అదే విదంగా తన నియామకానికి కృషి చేసిన మానవ హక్కుల సంఘం సభ్యులకు అమల కృత్ఞతలు తెలిపారు.

## విశ్వభారతిలో సెమ్స్ ఒలంపియాడ్ పోటీ పరీక్షలు:







కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి

రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాలలో సెమ్స్ ఒలంపియాడ్ పరీక్ష సెకండ్ లెవెల్ ఎగ్జామ్స్ జరుగుతున్నాయి .ఈ సందర్భంలో పెద్దపల్లి జిల్లా తరఫున విశ్వభారతిలో ఈ పరీక్ష కేంద్రంలో ఆదివారం పది పాఠశాలలకు సెమ్స్ ఒలంపియాడ్ సెకండ్ లెవెల్ ఎగ్జామ్ జరిగింది. ఈ పరీక్షల్లో విశ్వ భారతి .నవోదయ ,సెయింట్ జోసెఫ్ ,ప్రగతి హై స్కూల్ ,స్పందన ,గుడ్ మార్నింగ్ ,కృష్ణవేణి టాలెంట్ స్కూల్ తదితర పాఠశాలకు పోటీ పరీక్షలు నిర్వహించబడ్డాయి . ఈ పరీక్షా కేంద్రంలో పరీక్ష పత్రాలను సెమ్స్ ఒలింపియాడ్ రాష్ట్ర కన్వీనర్ రామచంద్రారెడ్డి, ట్రస్మా రాష్ట్ర ఉపాధ్యక్షులు బందారపు యాదగిరి గౌడ్ , ట్రస్మా అధ్యక్షులు అధర్ సమ్మారావు ,రామగుండం సెక్రటరీ శ్రీనివాసరెడ్డి, జిల్లా సెక్రెటరీ తిరుపతిరెడ్డి హెడ్మాస్టర్ తిరుపతి గౌడ్ ప్రిన్సిపల్ ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర కన్వీనర్ అరకాల రామచంద్రారెడ్డి మాట్లాడుతు.....ఈ పోటీ పరీక్షలు విద్యార్థుల మేధస్సును పెంపొందించే విధంగా ప్రతిభను వెలికి తీసే విధంగా అన్ని పోటీ పరీక్షలకు ట్రైనింగ్ అయ్యే విధంగా ఉంటాయని తెలిపారు.

## నిరంతర పోరాట స్ఫూర్తితో సాగిన భగత్ సింగ్,రాజగురు, సుఖదేవ్ లు నేటి విద్యార్థి, యువతరానికి ఆదర్శం కావాలి:

**– పి వై ఎల్–పి డి ఎస్ యు**
**– భగత్ సింగ్,రాజగురు, సుఖదేవ్ ల 94వ వర్ధంతి సందర్భంగా ముద్రించిన గోడ పత్రికలు ఆవిష్కరణ:**

కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి




నిరంతర పోరాట స్ఫూర్తితో సాగిన భగత్ సింగ్,రాజగురు,సుఖదేవ్ లు నేటి విద్యార్థి, యువతరానికి ఆదర్శం కావాలనీ పి వై ఎల్–పి డి ఎస్ యు నాయకులు అన్నారు. ఈ సందర్భంగా స్థానిక అంతర్గాం మండల కేంద్రంలో 18 నుండి 23 వరకు భగత్ సింగ్ 94వ వర్ధంతి సభలను రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా జరిపాలని గోడ పత్రికలు విడుదల చేయడం జరిగింది .ఈ సందర్భంగా ప్రోగ్రెస్ యూత్ లీగ్ పి వై ఎల్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు పెండ్యాల రమేష్ మాట్లాడుతూ.....దేశ స్వాతంత్రం కోసం, బ్రిటిష్ ముష్కరులు అమలు చేసిన అనిచివేత,దోపిడి, దౌర్జన్యాలకు,సామ్రాజ్యానికి వ్యతిరేకంగా నిరంతర పోరాట స్ఫూర్తితో సాగిన భగత్ సింగ్ రాజగురు,సుఖదేవులు నేటి విద్యార్థి,యువతరానికి ఆదర్శం కావాలని అన్నారు. పివైయల్ జిల్లా అధ్యక్షులు పెండ్యాల రమేష్ భగత్ సింగ్ రాజగురు,సుఖదేవుల 94 వ వర్ధంతి సందర్భంగా ముద్రించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... మానవ చరిత్ర పుటలు తిరగేస్తే చార్వాకులు, స్పార్టకస్ వంటి ఉజ్వల తారలు ఉన్నతమైన ప్రగతిశీల ప్రయోజనాల కోసం ప్రాణాలర్పించారని, ప్రపంచ స్థాయిలో చేగువేరా,ఫైడల్ కాస్ట్రో లాంటి విప్లవ వీరులు అమెరికన్ సామ్రాజ్యవాదుల కబంధహస్తాల్లో అమరులయ్యారని అదే కోవలో భారత ఉపఖండం లో భగత్ సింగ్,రాజగురు, సుఖదేవ్ లు బ్రిటిష్ సామ్రాజ్యవాదుల చేతిలో ఉరి తీయబడినరని, భగత్ సింగ్ తన సహచరులు కలలుగన్న సార్వభౌమాధికారం, లౌకికవాదం,సోషలిజం కోసం పోరాడుతున్న ఎందరికో గొప్ప స్ఫూర్తినిస్తుందని వారు అన్నారు. భారతదేశన్ని పట్టిపీడిస్తున్న సామ్రాజవాదానికి, పెట్టుబడిదారు వ్యవస్థకు, మతోన్మాదం,కులతత్వాలకు వ్యతిరేకంగా భారతీయ విద్యార్థి,యువతరం,ప్రజలు భగత్ సింగ్ స్ఫూర్తితో ఉద్యమించాలని ,దేశంలో మోడీ ప్రభుత్వం కుహనా దేశభక్తిని బట్టబయలు చేస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అమెరికాలో నివసిస్తున్న భారత ప్రజలపై అనుసరించే దుశ్చర్యలకు వ్యతిరేకంగా భగత్ సింగ్, రాజగురు,సుఖదేవ్ ల 94వ వర్ధంతి సభలను జరుపుకోవాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పి వై ఎల్ జిల్లా నాయకులు తీగుట్ల రాములు, మార్త రాములు, కాంపల్లి సతీష్ ,రవి, విష్ణువర్ధన్ ,నవీన్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలలో ఎస్సీలకు ఎంత శాతం

– మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ గౌతం
–ఈకార్యక్రమంలో డిఆర్ఓ హరిప్రియ,
– జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి వినోద్ కుమార్
– సిపిఒ శేఖర్
–జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ

**కరుణాకర్ మల్లిగారి,కరపత్రం ప్రతినిధి**




జిల్లాలోని శాఖల వారీగా రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలలో ఎస్సీలకు ఎంత శాతం లబ్ది చేకకూరుతుందనే జాబితాలను మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం పరిశీలించారు. సోమవారం కలెక్టరేట్ విసి హాల్ లో షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్ సభ్యులు మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లాకు మంగళవారం రానున్న సందర్భంగా జిల్లా అధికారులతో ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలలో ఎస్సీలకు ఎంత శాతం లబ్ది చేకూరుతుందని శాఖల వారీగా కలెక్టరు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్సీలకు ఎంత శాతం లబ్దిచేకూరుతుందనే జాబితాలను కలెక్టరు పరిశీలించారు. వివిధ సంక్షేమ శాఖల ద్వారా అందించే రైతు భరోసా,రైతు బీమా,రుణ మాఫీ, గృహాలక్ష్మి, స్వయం సహాయక బృందాల రుణాలు, మహిళా శక్తి, 2 బిహెచ్ కె వంటి పథకాల అమలు లో ఎంత మంది ఎస్సీలకు లబ్ది చేకూరిందని జిల్లా కలెక్టరు సంబంధిత శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన సలహాలను, సూచనలను అధికారులకు కలెక్టరు తెలిపారు. జిల్లా జనాభాలో ఎస్సీలు ఎంత శాతం ఉన్నారు అని సిపిఓ ను అడిగారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ హరిప్రియ, జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి వినోద్ కుమార్, సిపిఒ శేఖర్, జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ, విద్యాశాఖాధికారి విజయ కుమారి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలత, హౌజింగ్ఈఈ రమణమూర్తి, ఎస్సీ కార్పొరేషన్ఈడి బాబు మోసెస్, పరిశ్రమలు అధికారి ప్రశాంత్, సివిల్ సప్లై, అధికారి సుగుణబాయి, మెడికల్ అండ్ హెల్త్ అధికారి ఉమాగౌరి, విద్యుత్తు శాఖాధికారి, జిల్లా ఉపాధి అధికారి రాధిక తదితర శాఖల అధికారులు అందరు పాల్గొనారు.

## 18 వేల రూపాయలు వేతనం అందజేయాలి...

– ఉద్యోగ భద్రత కల్పించాలి...
– అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల లో ఆశా కార్యకర్తల డిమాండ్స్ పరిష్కరించాలి...
– మండల అధ్యక్షురాలు రాజమణి..

**కరపత్రం శంకరపట్నం మార్చి 17**





గ్రామాల్లో వైద్య సేవలు అందిస్తున్న ఆశా కార్యకర్తలకు 18 వేల రూపాయల వేతనం అందించి ఉద్యోగ భద్రత కల్పించాలని ఆశ వర్కర్ల మండల అధ్యక్షురాలు రామగిరి రాజమణి ప్రభుత్వాన్ని కోరారు. సిఐటియు పిలుపుమేరకు బడ్జెట్ సమావేశాల్లో ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ తాసిల్దార్లకు ఓ వినతి పత్రాన్ని రాష్ట్రవ్యాప్తంగా సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా రాజమణి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆశా కార్యకర్తలు గ్రామాల్లో ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారని, ఆశా కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించి శ్రమకు తగ్గ వేతనంగా కనీస వేతనంగా నెలకు 18 వేల రూపాయల వేతనాన్ని చెల్లించాలని, ఈ ఎస్ ఐ పి ఎఫ్ ఇతర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా ఆశా కార్యకర్తలకు ప్రభుత్వము అన్ని వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో ఆశా కార్యకర్తల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వము ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రాష్ట్ర మంత్రివర్గం ప్రత్యేక చొరవ తీసుకొని ఆశా కార్యకర్తలను న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు కరీంనగర్ జిల్లా మానకొండూరు నియోజకవర్గం శంకరపట్నం మండలం తాసిల్దార్ బత్తుల భాస్కర్ కు ఆశా కార్యకర్తల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వపరంగా తమకు న్యాయం చేయాలని కో వినతి పత్రాన్ని అందజేసినట్లు పేర్కొన్నారు ఇప్పటికైనా ప్రభుత్వ స్పందించి శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో ఆశా కార్యకర్తలను డిమాండ్ల పరిష్కారం కోసం ప్రత్యేక చర్య తీసుకోవాలని, నిర్లక్ష్యం చేస్తే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు లలిత జహెదా, సుజాత, పుష్పలత, సులోచన సుభద్ర మండలంలోని వివిధ గ్రామాల ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బంగారు పథకాలు సాధించిన చిన్నారులను అభినందించిన పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణ రావు

కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి



మల్కాజిగిరి, మేడ్చల్ లో ఈనెల 16 న జి. సాయి కుమార్ చీఫ్ ఆర్గనైజర్ ఆధ్వర్యంలో జరిగిన మూడోవ జాతీయ స్థాయి కరాటే, కుంపు పోటీలలో పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు మేఘన, పుష్ప, మీనాక్షీ చరిష్మా , అభినయ్, ఇండియన్ పబ్లిక్ స్కూల్ నుండి జి. హర్ష వర్ధన్ లతోపాటు పలువురు బాల బాలికలు క్రీడా పోటీలలో పాల్గొని అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి పలు విభాగాల్లో బంగారు పథకాలు సాధించారు.

ఈ సందర్భంగా విద్యార్థులను సోమవారం రోజున ఎలిగేడు మండలం శివపల్లి గ్రామంలోని తన నివాసంలో బంగారు పథకాలు సాధించిన విద్యార్థులను ప్రత్యేకంగా పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ...విద్యార్థులు రానున్న రోజుల్లో మరింత నైపుణ్యంతో క్రీడల్లో రాణించాలని ,క్రీడాకారులకు తన వంతు సహాయ సహకారాలు ఎప్పటికీ ఉంటాయని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తుందని, క్రీడాకారులకు అన్ని రకాలుగా ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాయిరి మహేందర్,మంకీ ఫిస్ట్ కుంపు అకాడమీ మాస్టర్ జి.సతీష్, తదితరులు పాల్గొన్నారు.